

**"రాత్రయ్యగా రొచ్చారండి" అంటూ లోపల కొచ్చిన నౌకరు పోరామోరా గారితో చెప్పాడు.**

**"రాత్రయ్య గారెవర్రా?" అన్నాడు పోరామోరా ఆశ్చర్యంగా.**

**"అదేనండీ - తోలు సంచీతో ముగ్గురు కలిసొస్తారు-ఆరండి-"**

**"చచ్చాం! వాళ్లా? 'రా త్రయమా?' ఏం చెప్పావు?"**

"నేనేం చెప్పలేదండి. ఆరే చెప్పారండి. 'అయ్య గారు రమ్మన్నారు. లోపలకెళ్లి చెప్పు అని-"

"నేను రమ్మన్నానని చెప్పారా? అమ్మ వీళ్ల అసాధ్యం కూలా? నేను రమ్మన్నానని చెప్పకపోతే, నువ్వు మామూలుగా అందరికీ చెప్పినట్టే వీళ్లకీ లేనని చెప్పి ఉందువు. అందుకని వాళ్లీ నాటకం ఆడారు."

"అంతే గదండీ - ఆరితో నేనేం చెప్పనండీ- ఏదన్నా డబ్బిస్తే ఆరే ఎల్లి పోతారండి."

డబ్బూ లేదు గిబ్బూ లేదు. అసలు వాళ్లని చేరదీయడం నాదే తప్పు-" అంటూ బైటకు కదిలారు పోరామోరా.

హాల్లో కూర్చున్న రా త్రయాన్ని - అంటే రాజు, రామం, రావు గార్లను శ్రీ పోరామోరా అంటే పోతుగడ్డ రామమోహనరావుగారు చూశారు.

ముగ్గురూ ఒకరి తరువాత ఒకరు 'నమస్కారం, నమస్తే, గుడ్ మార్నింగ్' అన్నారు. అసలు ఇంతకు ముందు వారెప్పుడూ నమస్కారం అని ఐక్య కంఠంతో అనేవారు. కాని వారు అలా అనడం చేత ఒక్కరే అంటున్న భ్రాంతి చాలా మందికి చాలా సార్లు కలిగింది. అంచేత ఆ అలవాటును వారు మార్చుకున్నారు.

"ఊ చెప్పండి-ఊరక రారు మహాత్ములు" అన్నారు పోరామోరా చాలా ముక్తసరిగా.

"అబ్బే - అదేం లేదండి - తమరి దర్శనం చేసుకు పోదామని" అన్నాడు మూడో రా.

"చల్లకి వచ్చి ముంత దాచడం ఎందుకూ? చెప్పరా" అని మొదటి రాతో చెప్పాడు రెండో రా.

"అదేనండి. తమకు 'సహస్ర సన్మానోత్సవం' చేద్దామని" అని నసిగాడు మొదటి రా.

"నాకు సహస్ర సన్మానోత్సవమా?" అని ఆశ్చర్యపోయాడు పోరామోరా.

"అవునండి. మీ నట జీవితంలో మీకు ఇంతవరకూ సుమారు వేయిపైనే సన్మానాలై ఉంటాయి. మేం లెక్కపెట్టాం కూడా. మాకు 900 పైదాకా తేలాయి. మాకు తెలియకుండా మరి కొన్ని జరిగిఉంటాయి. ఆ సంగతి ఆడియన్స్‌కి చెప్పకుండా, ఇప్పుడు మేం చేయబోయేది - అదే మీరు చేయించుకోబోయేది వేయ్యోది అంటాం. ఈ జనం లెక్కపెట్టారా - చచ్చారా?" అని ఉపోద్ఘాతం ముగించాడు మొదటి రా.

సన్మానం అంటే చేయించుకోవాలని ఉన్నా, వెయ్యోది అంటే మనసు ఉర్రూతలూగుతున్నా, ఆయనకి చేయించుకోవాలని లేదు.

"నాకు సన్మానా లొద్దు. చేసి చేసి, చూసి చూసి నాకు విసుగెత్తిపోయింది. బహుమతుల్ని పెట్టుకుందుక్కూడా చోటులేదు. అంచేత, నన్ను ఒదిలి పెట్టండి" అన్నారు నిష్కర్షగా.

"మీరు అలా అనకండి. సహస్ర సన్మానోత్సవం చేసుకుంటున్న మొదటి ఆంధ్రా హీరో మీరే" అన్నాడు మొదటి రా.

"ఆంధ్రా హీరో ఏమిటి? మిగతా భాషల్లో మాత్రం ఉన్నారా, చచ్చారా?" అన్నాడు రెండో రా.

'మీకు చేసే ఆ అదృష్టాన్ని మాకు కలిగించండి' అన్నాడు మూడో రా.

'ఒద్దండి. మొదట్లో ఏదో ఫిగర్ చెబుతారు. తరువాత దాన్ని అలా అలా పెంచుకు పోతారు.'

లేదండి. ఇప్పుడలా కాదండి. ఇది వరకు సాధారణ, అసాధారణ అని రెండే రెండు తరగతులు పెట్టాం. కాని, ఇప్పుడు సాధారణ కూడా కొంచెం ఎక్కువే అని కొందరు అభిప్రాయ పడుతున్నారు. అంచేత మేం అతి సాధారణ, మహాసాధారణ అని మరో రెండు తరగతులు పెట్టాం - సాధారణ కన్నా ఓ మెట్టు తక్కువగా" అన్నాడు మొదటి రా.

"మీ రో ఫిగర్ చెబితే, ఆ ఫిగర్‌కి తగినట్టే చేస్తాం" అన్నాడు రెండో రా.

"ఒద్దండి - ఎందుకంటే, నా కీ సన్మానాలతో బోరు కొట్టిపోయింది."


రా త్రయం నిర్ఘాంతపోయారు. ఒకరి మొహా లొకరు చూసుకున్నారు. మొదటి రా ఓ ఎత్తు ఆలోచిస్తున్నాడు.

"అవుననుకోండి. అయినా-" ఏదో చెప్ప బోయాడు.

"పైగా నాకు సినిమాలు అంతగా లేవు. చూస్తున్నారుగా!"

"అందుకే సన్మాన మండి. మీ నటన, మీ అనుభవం, మీ గత చరిత్ర ఒక్కసారి తిరగతోడి జనానికి చెప్పాలి" అన్నాడు మొదటి రా.

# సజీవ సంతాప సభ



వారం వారం
కథాప్రభ

స్వామిచిత్రానంద


"దాంతో నిర్మాతలు తిరగబడి మీ దగ్గరకు రావాలి" అన్నాడు రెండో రా.

"మీ నటజీవితం మూడు వువ్వులు ఆరుకాయలుగా వర్థిల్లాలి" అన్నాడు మొదటి రా.

పోరామోరా సందిగ్ధంలో పడ్డారు.

ఇంతలో నౌకరు వచ్చి, ఆయన చెవిలో ఏదో గొణిగాడు. ఆయన రా త్రయం వైపు తిరిగి -

"ఒక్క నిమిషం - ఇప్పుడే వస్తాను. పోలిగాడు కాఫీలు ఇస్తాడు-తాగుతూ ఉండండి" అని లోపలకు




వెళ్లారు.

లోపల గదిలో పోరామోరా గారి శ్రీమతి మంచం మీద కూచుని ఆనాటి దినపత్రిక చూస్తోంది. ఆమె దగ్గరకు వచ్చిన పోరామోరా- "బేగమ్! ఏమిటి హుకుం?" అన్నాడు.

"ఏవిటండీ! మీరు సన్మానం ఒద్దంటారు? మీకు సినీమాల్లేవు. మీరు ఉన్నారో, లేరో ఎవరికీ తెలియడం లేదు. మిమ్మల్ని చూడ్డానికి వచ్చే బస్సులు కూడా తగ్గిపోయాయి. ఈ సన్మానం వంకని వాళ్లు మిమ్మల్ని నలుగురికీ చూపిస్తాం అంటున్నారు."

"నిజమే అనుకోండి బేగమ్. ఈ పరిస్థితుల్లో ఈ సన్మానం చేసుకుంటే, మన సొంత ఖర్చుతో పబ్లిసిటీ చేసుకుంటున్నారు అనుకుంటారు."

"సన్మానం అంటేనే- సొంత ఖర్చుతో చేసుకునే పబ్లిసిటీ అని అందరికీ తెల్సు-"

"అవుననుకోండి బేగమ్- నాకేవిటో ఇదిగా ఉంది" అన్నారు అనలేక అనలేక.

"అయితే, సన్మానానికి బదులు ఇది చూడండి. ఇలా చేసుకుంటే!" అని ఆనాటి దినపత్రికలో ఉన్న సగం పేజీ ప్రకటన చూపించింది.

ఆ పత్రికలోని ప్రకటనను పోరామెరా పరీక్షగా చూశారు.

'ఇది సంతాపసభ, పైగా ఇది మనిషి చచ్చిపోయిన తర్వాత చేస్తారు. బతికుండగా చేయరు.'

"ఎందుకు చెయ్యరు? చేయించుకునే మన ఇష్టమా? చూసే జనం ఇష్టమా?" అందా బేగమ్ అధికార పూర్వకంగా.

పోరామోరా మెత్తబడుతున్నారు.

'అలాగే చేయించుకుంటాం- చెప్పండి వాళ్లకు' అని ఆజ్ఞాపించింది.

"జో- హుకుమ్" అని బయటకు వెళ్లాడు.

"క్షమించాలి, మిమ్మల్ని కూచోబెట్టేశాను."

"లేదండి. పర్వాలేదండి."

"అదే- మా బేగమ్‌కి ఓ ఆలోచన వచ్చింది.

"చెప్పండి." అన్నారు ముగ్గురూ. ఇది మాత్రం ఒకేసారి.

"ఈ సన్మానసభలు మామూలే! 'సహస్ర సన్మానం' అన్నా కూడా జనం రారు, పైగా నవ్విపోతారు."

ముగ్గురూ నిరుత్సాహపడిపోయారు.

"అయితే, ఏదన్నా మరో వంక పెట్టి, మిమ్మల్ని జనం ముందు నిలబెడతాం రెండు రోజులు టైమిస్తే, ఆ కారణం ఆలోచించి బడ్జెట్ వేసుకు వస్తాం" అన్నాడు మొదటి రా.

"ఆ శ్రమ మీకు అక్కర్లేదు. అదీ మా బేగమ్ చెప్పింది."

"అలాగా? చెప్పండి... చెప్పండి" అన్నారు ముగ్గురూ తలో మాటా తలో సారీ-

"అదే. ఇదిగో చూడండి" అని పత్రికలోని ప్రకటన చూపించాడు పోరామోరా.

వాళ్లు నిర్ఘాంతపోయారు.

"ఇది... ఇది..." అన్నాడు మొదటి రా.

"అదే..." అన్నాడు రెండో రా.

"ఇది" అన్నాడు మూడో రా.

"అవునండి సంతాపసభ, మనిషి బతికుండగానే ఎందుకు చేసుకోకూడదూ? ఎందుకు చూసుకోకూడదూ?" అన్నారు పోరామోరా.

"సజీవ సంతాపసభా!" అన్నాడు మొదటి రా.

"అవునండి... పేరు చాలా బాగుంది. 'సహస్ర సన్మానసభ' కన్నా బావుంది" అన్నారు పోరామోరా.

"ఇది చేసుకుంటున్న ప్రథమ ఆంధ్రా హీరో మీరే అవుతారు" అన్నాడు మొదటి రా.

"అంచేత మీరు వివరాలూ, బడ్జెట్లూ వేసుకు రండి" అన్నాడు పోరామోరా.

"ఓ- సిద్ధం" అని బ్యాగ్ జిప్ తెరవబోయాడు మొదటి రా.

"కాని- ఓ కండిషన్" అన్నాడు పోరామోరా.

"చెప్పండి-" అన్నారు 'రాత్రయం' అతి వినయంగా.

'మీరు నా ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ వేయండి. ఎట్టి పరిస్థితుల్లోనూ బడ్జెట్ దాటడానికి వీల్లేదు. అతి సాధారణంగా ఉండాలి' అని హెచ్చరించాడు పోరామోరా.

"అలాగేనండి. ఇపుడు మహాసాధారణం. అతిసాధారణం అని కొత్తగా రెండు తరగతులు సృష్టించాలి."

"మీబోటి వారి కోసం కాదనుకోండి."

"మీలాటి వారికి అసాధారణమే చేయాలి."

"మళ్లీ మళ్లీ చేస్తాంగనకనా?"

"ఏమో, ఏం చెప్పగలం?"

'దీని తర్వాత సహస్ర సన్మానోత్సవం చేద్దాం' అన్నాడు మొదటి రా.

ఈ మాటలు వింటున్న పోరామోరాకు తన శరీరం ఉప్పొంగిపోతున్నట్టు తోచింది.

ఆయన ఆనందాన్ని గమనించిన మొదటి రా- "మీ రో అరగంట టైమిస్తే, ఇక్కడే వివరాలు చెప్పేస్తాం. ఎందుకంటే, మనం చేయవలసిన ఐటమ్స్ అన్నీ ప్రింటెడ్ ఫారమ్‌లో ఉన్నాయి. వాటి ఎదురుగా మనం అనుకునే ఎమౌంట్ వేసేసి, మొత్తం కూడేసి, టోటల్ ఫిగర్ తేల్చుకోడమే- ఓ అరగంట పని" అన్నాడు.

"అది నిజమే అనుకోండి. నేనూ, మా బేగం ఇపుడు బైటకి వెళ్తున్నాం."

"అయితే, మరి ఎప్పుడు కలుద్దాం?"

'సాయంత్రం నాలుగు తర్వాత నేను ఫ్రీయే' అన్నాడు పోరామోరా. నిజానికి ఆయన అప్పట్నించీ ఫ్రీయే కాని, ఆ మాట చెప్పడం చిన్నప్పట్నించీ అలవాటు లేదు.

"మరైతే సెలవు తీసుకుంటాం" అన్నాడు రాత్రయం.

"ఉండండి, ఇంకో కాఫీ వేసి వెళ్దురుగాని- ఈలోగా డ్రైవరూ వస్తాడు. మిమ్మల్ని డ్రాప్ చేస్తాడు".

"ఒద్దండి. మేం నేరుగా ఆఫీసుకు వెళ్లడం లేదు. గోల్కొండ వెళ్లాలి. ఓ పాత బాకీ వసూలు చేసుకుందుకు."

"అక్కడే డ్రాప్ చేస్తాడు. అక్కడ్నించి కారు ఖాళీగా రాకుండా, మీరు పని పూర్తి చేసుకున్న తర్వాత, దాంట్లోనే మీ ఆఫీసులో దిగి పంపండి" అన్నారు పోరామోరా చాలా ఉదారంగా.

"చాలా థాంక్సండీ మీ అభిమానానికి" అన్నాడు మొదటి రా.

"దానిదేవుంది లెండి.... నే వస్తాను- మీరు మాత్రం డ్రైవరు వచ్చిం తర్వాతనే వెళ్లాలి, పోలాయ్! ఖాన్ రాగానే వీరిని తీసుకెళ్లి వీరు ఎప్పుడు వదిలితే అప్పుడు రమ్మను-"

"అలాగేనండయ్యా" అన్నాడు పోలయ్య.

"మరి నే వస్తా" అని పోరామోరా లోపలకు వెళ్లారు.

వచ్చిన పని అయిందన్న ఆనందంలో ముగ్గురూ డ్రైవర్ ఖాన్ కోసం ఎదురు చూసి, చూసి అతను రాగానే వెళ్లారు.

● ● ●

మర్నాడు ఉదయం.

హాల్లో పోరామోరా కూచుని ఆనాటి దిన పత్రికను చూస్తున్నారు.

ఓ ఆటో ఆగింది. వీరినీ, వీధినీ గమనించిన పోలయ్య- "ఈ ఆటో గూడా ఎదరింటికేనండి" అన్నాడు దీనంగా.

మరో ఆటో, మరో ఆటో వస్తున్నాయి- ఆగినవి ఆగుతున్నాయి. పోతున్నవి పోతున్నాయి.

"ఇప్పటికి ఆరు ఆటోలు వెళ్లాయండి" అన్నాడు విసుగ్గా పోలయ్య.

ఆఖరికి ఓ ఆటో వచ్చింది. అందులోంచి జనం దిగుతున్నారు. వారు అవతల్నించి దిగడం చేత ముఖాలు తెలియలేదు. వారిని కాస్త ముందుకెళ్లి గుర్తుపట్టిన పోలయ్య-

"ఆరేనండి- ఆ ముగ్గురే!" అన్నాడు త్రిమూర్తుల్ని ఒక్కసారి చూసినంత ఆనందంతో.

మొదటి రా ఆటోకి డబులిచ్చి పంపేశారు. ముగ్గురూ లోపలకు వస్తున్నారు.

వారిని చూసిన పోరామోరా మళ్లీ దినపత్రికను చూడ్డం మొదలెట్టారు. అంటే ఆ పత్రికలో తన మొహాన్ని దాచుకున్నారు.

"నమస్కారం - రండి."

"మా కోసం వెయిట్ చేస్తున్నారనుకుంటాం" అన్నాడు మొదటి రా.

"నేనెవరి కోసమూ వెయిట్ చేయనే!" అన్నారు పోరామోరా అదేదో పెద్ద నేరం అయినట్టు.

"కొంచెం ఆలస్యం అయింది. మేం ఎక్కిన మొదటి ఆటో దార్లో ఆగిపోయింది. రెండోది ఈ కొండలు ఎక్కలేక ఆగిపోయింది-"

"అయ్యో! నడిచి వచ్చారా?"

"లేదండి. ఆటో దొరికే దాకా ఆగి, ఆటోలోనే వచ్చాం-"

"కూచోండి- పోలాయ్!" అని అరిచాడు.

"ఎళ్తున్నానండి- కాఫీ తెస్తానండి."

"పంచదార విడిగా-"

"తెల్సండీ-" అని గట్టిగా అని- 'ఈరికి ఎన్ని కాఫీలు ఇవ్వలేదు?' అనుకున్నాడు తనలో.

"ఉ! తియ్‌రా బడ్జెట్ కాగితం" అన్నాడు మొదటి రా.

"బడ్జెట్ వేసేశారా ఏంటి?" అన్నారు పోరామోరా.

"వెయ్యలేదండి. మీ దగ్గర, మీ అనుమతితో వేద్దామని" అన్నాడు మొదటి రా.

మూడో రా ఓ ప్రింటెడ్ ఫారమ్ తీశాడు. దానిలో ఏ సభకైనా కావలసిన అంశాలన్నీ ఒక దాని కింద ఒకటి అచ్చయి ఉన్నాయి. వాటి ఎదురుగా రెండు కాలమ్స్ ఉన్నాయి. (జమా ఖర్చుల పుస్తకంలా) వాటిపైన 'అనుకున్నది'- 'అయినది' అని అచ్చయి ఉంది.

"ఒక్కొక్కటి చదువు" అన్నాడు మొదటి రా.

"సావనీర్!"

"సావనీర్ అవసరం అంటారా? ఆర్టికల్స్ కోసం మనం చెప్పులు అరిగేలా తిరగడం, వాళ్లు సరిగ్గా రాయకపోవడం, రాసినా టైముకి ఇవ్వకపోవడం. అయినా ఎంతవుతుంది?" అన్నారు పోరామోరా ఆత్రుతగా.

"వంద పేజీల సావనీర్‌కి 20 వేల దాకా అవుతుందండి."

"అబ్బ!"

"అయినా. ఆ ఖర్చులు మనం ఎడ్వర్టైజ్‌మెంట్స్‌తో తేగలవండి."

"ప్రకటనలు ఇస్తారుగానండి- బిల్లులు ఇవ్వరండి. నేను చాలాసార్లు చూశాను" అన్నారు పోరామోరా.

"అందుకని, దీనికి ఓ పదివేలు వేసి ఉంచుదాం. పిండికొద్దీ రొట్టె. అంతగా వస్తే, పేపరు క్వాలిటీ తగ్గించేద్దాం. ప్రకటనలు వచ్చిం తర్వాతనే ప్రింటింగు మొదలెడదాం. ఈలోగా మా రాజు, రామం ఆర్టికల్స్ రాసేసి ఉంచుతారు. అసలు ఇప్పుడు కొత్తగా రాయక్కర్లేదండి. రాసినవి చాలా ఉన్నాయి. వాటిల్లోంచి ఏరుకుని, మనకి అన్వయించేలా మార్పులూ, చేర్పులూ చేసుకోవడమే. దేన్ని ఎవరి పేరు మీద వెయ్యాలో తర్వాత డిసైడ్ చేద్దాం. మన దగ్గర చాలామంది బ్లాకులు ఉన్నాయి. మనకి ఆ ఖర్చు ఆదా" అన్నాడు మొదటి రా.

"ఓకే! ఆ తర్వాత?"

"ఆహ్వాన పత్రికలు" అన్నాడు మూడో రా.

"ఇవిగోనండి శాంపిల్స్ - ఇది పదిహేను. ఇది పది. ఇది ఎనిమిది. ఇది ఆరు. ఇదా అయిదు! ఇంతకన్నా తక్కువవీ ఉంటాయి గాని, మీ హోదాకి తగవు -" అని కార్డులు చూపించాడు.

"అయిదు రూపాయలవి చాలండి. మరీ నాసిగానూ కాదు. మరీ క్లాసుగానూ కాకుండా" అన్నారు పోరామోరా.

"ఓ వెయ్యి చాలవూ?" అన్నారు.

"ఉండాలి. ఉండాలి. అభిమాన సంఘాల వాళ్లు పీకల మీదకు వస్తారు" అన్నాడు మొదటి రా.

"వాళ్లు వేరే వేసుకుంటార్లేండి."


"అయితే ఇదో అయిదువేలు" అన్నాడు మొదటి రా.


మూడో రా దాని ఎదురుగా పెన్సిల్‌తో అంకె వేశాడు 'అనుకున్నది' అన్నచోట.

"తర్వాత పోస్టర్స్" అన్నాడు మూడో రా.

"పోస్టర్స్ కావాలా?"

"ఉండాలండి-మల్టీ కలర్‌లో కాకుండా సింగిల్ కలర్ లిథో వేయిద్దాం. అందులో ఆదా అయినది బానర్స్ ఖర్చు పెంచుదాం. ఎందుకంటే, ఇవాళ రాత్రి మనం పోస్టర్లు అంటిస్తే-అదే అతికిస్తే-






రేప్పొద్దున్న దాని మీద మళ్లీ ఎవడో అతికించే స్తున్నారు. బానర్స్ కూడా మరీ ఎక్కువ కాకుండా, ఓ ఇరవై అయిదు చోట్ల పెడదాం."

"ఒద్దండి... బానర్స్ ఒద్దు, సంతాప సభ అంటున్నాం కదా - రియలిస్టిగ్గా చేద్దాం. దానికి ఎడ్వాన్స్ పబ్లిసిటీ ఒద్దు" అన్నారు పోరామోరా.

"మరి జనానికి తెలవాలి - వాళ్లు రావాలి" అన్నాడు రెండో రా.

"దానిదేవుంది. జనం సప్లయర్ రాముకి చెబితే - ఓ వందమందిని వాడే తెస్తాడు-మంచి తాళజ్ఞానం ఉన్నవాళ్లని. మనలో ఒహడు జనంలో కూచుని చప్పట్లు మొదలెడతారు-స్టేజీ మీంచి మనం చెయ్యి చూపించగానే ఆపేస్తారు" అన్నారు పోరామోరా.

"ఇదో పదివేలు."

"హాలు కిరాయి" అన్నాడు మూడో రా.

"ఇది రవీంద్రభారతి లాంటిది ఒద్దు. సామాన్య మైనదీ, చవగ్గా వచ్చేదీ ఓ కళ్యాణ మండపం చూద్దాం. ఓ వెయ్యి రూపాయలు. ఏ అమావాస్య నాడో అనుకుంటే బాగా తగ్గుతుంది. ఏమైనా ఓ ఏడొందల ఏభై?"

"మరీ సందుల్లో కాకుండా చూడండి" అన్నారు పోరామోరా.

"తరవాతది హాలు అలంకరణ" అన్నాడు మూడో రా, ఏడు వందల ఏభై హాలు కిరాయికి ఎదురుగా పెన్సిల్‌తో నోట్ చేసి.

"దీనికి వెయ్యి ఉండాలండి కనీసం. ఎందు కంటే మామూలు కర్టెన్స్ పనికి రావు కదండీ - వెనక నల్లటి కర్టెన్-దానికి ఆరు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పున గ్యాప్-దానికి చక్కటి జరీ బోర్డరు వెడల్పుగా, ఈ గ్యాప్ వెనక ఓ తెర - ఆ తెరకీ ఈ తెరకీ మధ్య ప్లాట్ ఫారం దానిపైన సింహాసనం లాంటి కుర్చీ. దాంట్లోనే మీరు కూర్చు నేది. సభాప్రారంభంలో మీరు కనబడకుండా ఓ సిల్కు తెర. మీరు చలన చిత్రాల్లో నటించినా - ఇక్కడ మాత్రం నిశ్చలంగా నటించాలి. అధ్యక్షులు ఆ సిల్కు తెరను తొలగించగానే మీరు ఆయిల్ పెయింటింగ్‌లా కనబడతారు. మీకు ఈ సీనుకు కొత్తవి సిల్కు పంచ వెడల్పు జరీ అంచుది, సిల్కు జుబ్బా, సిల్కు కండువా ఉండాలి. కావాలనుకుంటే ఓ జోధ్‌పూర్ కోటు - ఇదీ నా ఊహ. ఇందులో మాత్రం మనం ఏ మాత్రం రాజీ పడొద్దు." అన్నాడు మొదటి రా.

"కొత్తవెందుకూ? నా దగ్గర మీరు ఊహించిన దృశ్యానికి సరిపడేవి, ఇదివరకు హిట్ పిక్చర్లలో వాడినవీ మూడు నాలుగున్నాయి. ఏదో ఒకటి డ్రై క్లీనింగ్ చేయించి వేసుకుంటాను" అన్నారు పోరామోరా.

"అయితే మన కో అయిదువేలు ఆదా" అన్నాడు మొదటి రా.

"ఆ తర్వాత ఉపన్యాసాల రచన" అన్నాడు మూడో రా.

"అబ్బ! మీరు అన్నీ చాలా వివరంగా వర్కవుట్ చేశారే" అన్నారు పోరామోరా.

"అవునండి. ఎందుకంటే, తర్వాత అపార్థాలు రాకూడదు చూడండి. ఇలాంటివి చేసి చేసి నా తల పండి పోయింది. అందుకే ఇప్పుడు మేం పెర్‌ఫెక్షన్ రీచయ్యాం."

"ఊ. తరవాత చదువు" అన్నాడు మొదటి రా.

"సన్మాన పత్రం రచన."

"ఇపుడు సన్మాన పత్రం కాదుగా - సంతాప పత్రం - అదుంటుందా? అదీ రాయించాలా?" అన్నారు పోరామోరా.

"రాయించాలండి-ఎందుకంటే - మన దగ్గిర రాసినవి లేవు. మేం ఇంత వరకూ ఇలాటి ఫంక్షన్ చేయలేదు కదండీ?" అన్నాడు మొదటి రా.

"ఎవరేనా ఉన్నారా రాసేవాళ్లు?"

'బోల్డు మంది ఉన్నారండి-రాసిన వాడి దగ్గరకే మనం వెళితే ఎక్కువ అడుగుతారు. పడతాం లెండి. మాంచి తెలుగు పండితుణ్ణి పడతాం- చెప్పి రాయిస్తాను. దానికి వెయ్యి నూట పదహార్లు'

"అర్థనూట పదహార్లతో సరిపెట్టండి" అన్నారు పోరామోరా.

"అలాగేనండి - ఆయన్ని కూడా స్టేజి ఎక్కిస్తాం అంతే. ఆయన ఆ ఫిగర్‌కే ఒప్పుకుంటాడు. దీనికి మరో రెండొందలు కలుపు. సంతాప పత్రం రాయించడం, దాన్ని ఫ్రేము కట్టించడం. ఆ పత్రం విడిగా హాల్లో పంచడానికి కరపత్రాల ప్రింటింగు."

"అలాగేనండి" అని నోట్ చేసి - "స్వాగత కన్యలు" అన్నాడు.

"వీళ్లెవరు?"

"అదేనండి - గుమ్మంలో నిలబడి ఆహూతుల మీద పన్నీరు చల్లి, పుష్పాక్షతలు ఇచ్చి స్వాగతం చెప్పి లోపలకు పంపేవాళ్లు."

"వాళ్లు? ఒద్దండి... సంతాప సభగా?"

"అవుననుకోండి. రెండు ఏడుపుగొట్టు మొహాల్ని నల్లచీర కట్టి నిలబెడతాం. పన్నీరు మాత్రం చల్లమందాం కన్నీరు కారుస్తూ. కలకండ, పువ్వులూ ఇవ్వరు."

"కావాలంటారా?" అన్నారు పోరామోరా.

"వేసి ఉంచుదాం. ఒద్దనుకుంటే తర్వాత తీసేద్దాం. ఇదో మూడొందలు."

"తరవాత పూర్ణకుంభం, వేద ఘోష"

"ఇదక్కర్లేదు" అన్నాడు మొదటి రా.

"సన్నాయి మేళం."

"ఇదీ ఒద్దు. ఎంత చచ్చుమేళం దగ్గిరికెళ్లినా, వెయ్యి, రెండు వేలూ అంటారు. ఏదన్నా మంచి షెహనాయ్ (ఏడుపుది) కేసెట్ కొందాం. మైకు వాళ్లకి ఇస్తే వాళ్లే ప్లే చేస్తారు."

"మైకులూ, యాంప్లిఫైయర్లూ" అన్నాడు మూడో రా.

"వేయి రూపాయలు" అన్నాడు మొదటి రా.

"ఇందులో మాత్రం కాంప్రమైజ్ ఒద్దు. ఓ రెండొందలు ఎక్కువైనా సరే మంచిది తెప్పించండి. తరువాత చెడిపోవడం, రిపేర్లు చేస్తే హమ్ రావడం, గరగర సౌండ్లూ ఏమీ ఉండకూడదు" అన్నారు పోరామోరా.

"అయితే మీ బావకి చెప్పరా" అని రెండో రాకి మొదటి రా చెప్పాడు.

"అలాగే! అయితే అదో పదిహేనొందలు."

"అయినా ఫర్వాలేదు" అన్నారు పోరామోరా.

'తరవాత పూల మాలలూ, శాలువలూ వక్తలకి.'

"తలకి మూడొందలు వెయ్యండి. ఆరుగురైనా ఉండాలి. ఇదో రెండువేలు."

''ఇందులో ఏమన్నా తగ్గించగలమా?'' పోరామోరా సందేహం.

"స్వంత శాలువా, పూలమాల తెచ్చుకునే వచ్చేవాళ్లున్నారు గాని పూల మాలలు అన్నీ తలో రకంగానూ ఉంటాయి. పూలమాలలు మనం కొంటాం. మన ఉపన్యాసం మాత్రం వాళ్లకిస్తామండి. ఫెయిర్‌గా కాపీ చేసి వాళ్లు చదువుకుని వస్తారు. కొందరు ఉపన్యసిస్తారు. కొందరు చూసి చదువుతారు."

"అయితే ఓ ఆరొందలు చాలు" మొదటి రా నిర్ణయించాడు.

"అధ్యక్షుడి కిరాయి, శాలువా, పూలమాల" మూడో రా చదివాడు.

"దీనికి మనవేం ఖర్చుపెట్టక్కర్లేదండి ఇద్దరు ముగ్గురున్నారు, వాళ్లు మనకి ఎంత ఎదురిస్తారో తెలుసుకుని, అత్యధికంగా ఇచ్చేవారిని రమ్మంటాం-"

"బావుంది, అలాగే మనం ఖర్చు అదా చేసుకోవాలి"అన్నారు.

"విరామ సమయంలో అల్పాహారం."

'ఒద్దురా ఇప్పటికే చాలా అయింది. ఈ సభ కూడా గంటా, గంటన్నర కన్నా ఉండకూడదు. తీసెయ్ -దీంట్లో మనకు ఓ పదిహేనువేలు ఆదా'

"వక్తలు, అధ్యక్షుడికీ బేటాలు - అదే వారికి రానుపోను ఆటో, టాక్సీ ఛార్జీలు-"

"మనిషికో వంద వెయ్యి, ఏ మూలనించి వచ్చేవారయినా సరిపోతుంది. ఇందులో కూడా తగ్గించడానికి ట్రై చేద్దాం. స్కూటరు, స్వంతకారూ ఉన్నవాళ్లని పడదాం-"

"హాలు సిబ్బందికి బక్షీసు-"

"ఓ వంద - " అని పోరమోరా వైపు తృప్తిగా చూసి, తర్వాత "కూడరా" అని ఆదేశించాడు మొదటి రా.

మూడో రా కాలుక్యేటర్ తీసి చకచకా కూడి - "మొత్తం ఇరవై ఆరువేల ఎనిమిది వందలు."

"మళ్లీ ఇంకోసారి కూడు."

మూడో రా మళ్లీ కూడాడు. "ఇపుడూ - అంతే!"

"మొత్తం ముప్పై, ముప్పై అయిదు దాటకుండా చూద్దాం - అనుకున్నా కొంచెం ఎక్కువే అవుతుంది. మరో ముప్పైకి ప్రిపేరవండి - అంతగా తక్కువైతే విరాళాలు వసూలు చేద్దాం"అన్నాడు. మొదటి రా.

''విరాళాలా?''అన్నారు పోరామోరా అయిష్టంగా.

"పోనీ- పబ్లిసిటీ...."

"సావనీర్ ఎత్తేస్తే?" అన్నారు పోరామోరా.

"ఓ పది తగ్గుతుంది, సావనీర్ మానేసి, మీరు నటించిన సినిమాల్లోంచి ఫోటోలు ఎగ్జిబిషన్ పెడదాం- జనానికి మీ సినిమాలు చూసిన తృప్తి కలుగుతుంది."

"ఐడియా బావుంది" అన్నారు పోరామోరా.

"అయితే, ఇరవైలో సరిపెట్టమంటారా?" అన్నాడు మొదటి రా.

"చూడండి - ఇంకా తగ్గించొచ్చేమో!"

"తప్పకుండా - సభ పొదుపుగా ఉండాలి, కక్కుర్తిగా చేసినట్టూ ఉండకూడదు, మీరు చేయించుకున్నట్లూ ఉండకూడదు."

"మరి డేట్?"

"వచ్చే నెల రెండో ఆదివారం."

"అలాగేనండి - వచ్చేది శూన్య మాసం. కళ్యాణ మంటపం చవగ్గా దొరుకుతుంది."

"అయితే, ఇప్పుడే అడ్వాన్స్ ఇచ్చి, బుక్ చేసెయ్యండి."

"అలాగే నండి!"

పోరామోరా లోపలకెళ్లి, 50 రూ॥ నోట్ల కట్ట. ఒకటి తెచ్చి ఇచ్చారు.

"సరే నండి - ఖర్చులన్నీ వివరంగా ఎప్పటి కప్పుడు నోట్ చేస్తాడు మా రామం. ప్రతి ఖర్చుకీ మా సమితి ఓచర్ పాడ్ మీద సంతకాలు తీసుకుంటాడు. ఈ అయిదువేలూ వేం అభిమానుల్నించి వసూలు చేసినట్లు చెబుతాం - ఇన్‌కమ్ టాక్స్ వాళ్ల కోసం-"

"అలాగే, మీ ఇష్టమండి, అన్నీ పెడ్తారు గాని, విడియో మర్చిపోయారు."

"లేదండి... ఉంటుంది."

"ఇది తప్పకుండా ఉండాలి, ఓ మోనిటర్ నాకు ఎదురుగా బాగా కనబడేలా పెట్టాలి, హాల్లో కనీసం నాలుగైనా ఉండాలి. వీలైతే బయట కూడా ఒకటి పెట్టండి - రోడ్డున పోయే వాళ్లు కూడా లోపలకు రావడానికి వీలుగా -"

"అవునండి - ఇది ఓ రెండువేలు."

'అయినా పరవాలేదు. ఇది చాలా ముఖ్యం. రికార్డుగా పడి ఉంటుంది. స్టిల్ ఫోటోగ్రాఫర్‌ని మనం పెట్టొద్దు. ప్రెస్‌వాళ్లు ఎలాగూ వస్తారు. వాళ్ల దగ్గర్నించి కావాలనుకుంటే మనం తీసుకుందాం' అన్నారు పోరామోరా.

"మరి, సెలవు తీసుకుంటావండి" అన్నాడు మొదటి 'రా'.

"మళ్లీ పునర్దర్శనం?" అన్నారు పోరామోరా.

"మళ్లీ మళ్లీ వస్తుంటామండి - ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ మీకు చెబుతూంటావండి. మార్పులూ, చేర్పులూ మీ సలహాల ప్రకారం మీ అనుమతితో చేస్తూంటాం. మిగతాది - అదే ఆ పదిహేనూ కూడా -" అని నాన్చాడు మొదటి రా.

"దాందేవుందిరా? ఓచర్స్ ఇస్తాం. మనీ తీసుకుంటాం" అన్నాడు రెండో రా.


"అదేరా, వారికి అసలు విషయం, మన పద్ధతీ తెలియాలిగా!" అని పోరావెూరా ఇచ్చిన అయిదువేలు తీసుకుని బయల్దేరారు రాత్రయం.

"అమ్మా! సెలవు తీసుకుంటాన్నాం" అన్నాడు మొదటి రా.

లోపల్నించి బదులు రాకపోయేసరికి - "లోపల బిజీగా ఉన్నారనుకుంటాను. వారికీ మా నమస్కారాలు చెప్పండి" అని బయల్దేరారు.

• • •

అప్పుడప్పుడు రాత్రయం రాత్రులు పోరా మోరాను కలుస్తూండడం, సంతాప సభ వివరాలు



## గమనిక

**18-9-1996 సంచిక నుండి ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పోటీల్లో పాల్గొనే పాఠకులందరూ పోటీల కోసం తపాలా శాఖవారు ప్రత్యేకించిన రెండు రూపాయల విలువ చేసే కార్డుల మీదనే రాయాలని కోరుతున్నాము. గతంలో వలె పదిహేను పైసల కార్డుల మీద రాసి పంపినా, గడి-నుడి కూపనులు అంటించి పంపినా స్వీకరించము అని గమనించాలి.**

**- సంపాదకుడు**

చర్చించడం, జమా ఖర్చులు చూసుకోవడం... అన్నీ సవ్యంగానే జరుగుతూ వచ్చాయి.

ఆ సంతాప దినోత్సవం రానే వచ్చింది.

ఆ నాడు -

సంతాప సభ జరిగే కళ్యాణ మంటపం ముంగిట కూడా అలంకరించబడి ఉంది. కాని - రంగు రంగుల్లో కాకుండా, నలుపు రంగుల్లో, నల్లటి గుడ్డమీద 'పోరామోరా- సజీవ సంతాప సభ - మీరూ ఆహ్వానితులే' అని రాసి ఉంది. నల్ల కాగితం జెండాలు వేలాడుతున్నాయి. రాత్రయం నల్లటి దుస్తుల్లో ఉన్నారు. వారి హృదయం మీద వారి సమితి చిహ్నం గల బాడ్జీలు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. ముఖ ద్వారం వద్ద, ఇద్దరు నల్లని అమ్మాయిలు తమకున్న నల్లని చీరలు కట్టుకుని, నిశ్శబ్దంగా నిలబడి లోపలకు వెళ్లండి అని సైగ చేస్తున్నారు. నేపథ్యంలో వయోలిన్ మీద మోహన రాగాలాపన శోకరసాన్ని గుప్పిస్తోంది. ఒక అమ్మాయి ఒక వెండి గిన్నె ఆహూతులకు చూపుతోంది. అది చందనం అనుకున్న వారు అందులో చెయ్యి ముంచి బయటకు వచ్చిం తర్వాత చేతిని వాసన చూసుకుంటున్నారు. చేతికి ఏమీ అంటుకోలేదు. "అది చందనం కాదు, అది 'సంతాప సూచకంగా' సమితి కార్చిన కాన్నరు" అని ఓ పాత్రికేయుడు విమర్శించాడు.

పట్టు ధోవాతి కట్టుకుని, బూట్స్ తొడుక్కొని, జోధ్‌పూర్ కోటు తొడుక్కున్న పోరామోరా (మేకప్‌తో) సిద్ధంగా ఉన్నారు సింహాసనం అలంకరించడానికి.

ఆనాడు ఆదివారం - ఆ కళ్యాణ మంటపం ఓ పార్క్‌కు దగ్గరగా ఉండడం చేత పార్క్‌కు వచ్చిన వృద్ధులూ, వయోవృద్ధులూ 'ఆ సజీవ సంతాప సభ' ఏవిటో చూద్దామని లోపలకు వచ్చారు.

పిలవకనే వచ్చిన వారితోనూ, పిలిచినదే అదనుగా వచ్చిన వారితోనూ, కిరాయికి వచ్చిన వారితోనూ హాలు నిండింది.

అధ్యక్షుడూ, వక్తలూ రావాలి - సభ మొదలు పెట్టాలి.

వారు కూడా ఒకరి తరువాత ఒకరు వచ్చారు.

మొదటి రా పోరామోరా వద్దకు వెళ్లి 'ఆ చెక్కు' తీసుకున్నాడు. వేదిక ముందుకు వచ్చి మైకు ముందు నిలబడి - ఏదో చెప్పాలని ప్రయత్నం కాని మాట రావడం లేదు. ఏడుపు వస్తోంది. అతి కష్టం మీద -

"సభ ప్రారంభం అవుతుంది'' అని ఏడుస్తూనే చెప్పి, ఏడుస్తూనే పక్కకు కదిలాడు.

ముందు తెర పైకి లేచింది. అధ్యక్షుడు, వక్తలూ, శ్రీమతి పోరామోరా వేదిక ఎక్కి, తమ తమ స్థానాలు అలంకరించారు.

అధ్యక్షుడికి కార్యక్రమం కాగితం ఇచ్చాడు మొదటి రా.

దాన్ని చూసిన అధ్యక్షుడు - "మొదట గీతాలాపన'' అన్నారు.

మొదటి రా చెయ్యి చూపించగా, మైకు యజమాని టేపు రికార్డరు ఆన్ చేశాడు.

అందులోంచి - "జాతస్య హి ధృవో మృత్యుః ధృవం జన్మ మృతస్య చ

జనన ముంటే చావు తప్పదు - మరణముంటే జన్మ తప్పదు

చావు పుట్టుకల చక్రం జీవరాసులకు సహజం

నిండింది నూరేళ్ల బ్రతుకు - మిగిలింది ఈ చిన్న గురుతు.''

మొదటి రా చెయ్యి చూపగానే టేపు ఆగిపోయింది.

'చాలా కాలం తర్వాత సందర్భశుద్ధి ఉన్న నేపథ్య గీతం వినబడింది. అది రాజుగారి చలవే!' అన్నారు ఎవరో ప్రేక్షకుల్లోంచి.

అధ్యక్షుడు లేచి -

"శ్రీ పోరామోరా గారి సజీవ చిత్ర పటావిష్కరణ'' అని కొంచెం వెనక్కి వెళ్లి, చిన్న తెరను తొలగించారు దానివెనక నిశ్చలంగా సింహాసనంపై కూచున్న పోరామోరా కనుపించారు.

అధ్యక్షులు కాగితం చూసి - "ఇపుడు వారిని పుష్పమాలాలంకృతులను చేయుట'' అన్నారు.

ఇద్దరు దృఢకాయులు ఓ కర్రకు కట్టిన గజ మాలను (పూలమాల చాలా పెద్దది. అతి కష్టం మీద ఇద్దరు మోయగలరు.) తెచ్చి, వారి తల పైకెత్తి పట్టుకున్నారు. చూసేవారికి పోరామోరా చిత్ర పటానికి పూలమాల వేసినట్టే ఉంటుంది.

"ఇపుడు శ్రీమతి పోరామోరా సంతాప పత్ర సమర్పణ - రచన, పఠనం: ఉభయ భాషా ప్రవీణ, బ్రహ్మశ్రీ కుప్పిగంతుల హనుమచ్ఛాస్త్రిగారు. ''

వారు వేదిక ముందుకు వచ్చారు.

వారికి ఓ కాశ్మీరు శాలువాను కప్పి, చందన మాలను వేశారు మొదటి రా. ఆయన వెనక రెండో రా, మూడో రా సంతాప పత్రాన్ని మోసుకు వచ్చారు. దాన్ని హనుమచ్ఛాస్త్రిగారికి ఎదురుగా అద్దం పట్టినట్లు పట్టుకున్నారు. హనుమచ్ఛాస్త్రి గారు కళ్లజోడు తీసి, సవరించుకుని, చదవబోయారు.

అంతలో అధ్యక్షులు లేచి-"ఈ సంతాప పత్రం ప్రతిని ప్రేక్షకులందరికీ అందజేశారు. అంతా చదివారు. అంచేత దాన్ని మళ్లీ చదవడం కాల హరణమే అవుతుంది. అంచేత శ్రీమతి పోరామోరా గారిని వచ్చి ఆ పత్రాన్ని స్వీకరించ మంటున్నా- అదే, ఆమెగారు దాన్ని స్పృశిస్తే చాలు. అందుకున్నట్టే - ఆ పత్రాన్ని అద్దం పగలకుండా కార్యకర్తలు తర్వాత వారి ఇంటికి చేరుస్తారు'' అన్నారు.

శ్రీమతి గారు లేచి చాలా విచార వదనంతో వచ్చి, దాన్ని స్పృశించి అలాగే వెనక్కి వెళ్లి, తమ కుర్చీలో కూర్చున్నారు.

ఇద్దరు రాలు ఆ పత్రాన్ని మోసుకుని లోపలకు వెళ్లారు.

అధ్యక్షులు లేచి-"ఇపుడు నిత్యనూతన కవి శ్రీ మొగలి రేకుల రాసిన 'సంతాప శతరత్న మాల' లోంచి ముత్యాలవంటి మూడు రత్నాలు ఆలపిస్తారు.''

శ్రీ మొగలిరేకుల వేదిక మీదకు వచ్చారు. దుశ్శాలువ కప్పడం, పూలమాల వేయడం, చప్పట్లు కొట్టడం అన్నీ సక్రమంగా జరిగాయి.

మొగలిరేకుల గొంతు సవరించుకుని - "నేను రాసిన సంతాప శత గీతావళి సిద్ధంగా ఉంది. కాని

అధ్యక్షుల ఆజ్ఞానుసారం అందులోంచి మూడే మూడు పఠిస్తాను." ఓసారి దగ్గి -

తొందరపడ్డావు మోరా
ముందే వెళ్లిపోయావు మోరా
కవులూ, గాయకులూ, నాయకులూ శిలలై ఉన్న
టాంకు బండ్‌మీద అదే వరసలో
తెలుగు నటనకు శాశ్వత చిహ్నంగా
మీ శిలను మీరే ప్రతిష్ఠించాలనుకున్నా కాని -
॥తొందరపడ్డావు॥

రేటు పెరిగిన నేటి నటనకు
రేటు కట్టలేని మీ మేటి నటనను
చలన చిత్ర కదంబంగా చేసి
వాడవాడలా, వాడికీ వీడికీ చూపాలనుకున్నా
కానీ -
॥తొందరపడ్డావు॥

నిన్నగాక మొన్న మీ షష్టిపూర్తి
మొన్నగాక నిన్న మీ రజతోత్సవం
ఇంకా ఏవో ఏవేవో చేయాలని
అనుకున్నాం - అనుకుంటున్నాం
కానీ -
॥తొందరపడ్డావు"॥

హాలులో జనం తెలియక చప్పట్లు కొట్ట బోయారు. వేదిక మీద ఉన్న మొదటి రా వద్దని చెయ్యి చూపటంతో మానేశారు.

"తర్వాత కుమారి వాసవి కన్యకాపరమేశ్వరి" అన్నారు అధ్యక్షులు.

కుమారి విషాద వదనంతో వేదిక ముందుకు వచ్చింది. మొదటి రా గారి సతీమణి ఆమెకు బొట్టు పెట్టి, కుంకుమ భరిణి, ఓ పట్టుచీర, రవికల గుడ్డ ఇచ్చింది.(ఇవన్నీ కుమారి ఇచ్చినవే! పుష్పమాల వేయలేదు - ఆమె ఇవ్వలేదు కనుక)

కుమారి మైకు ముందు వచ్చింది. మైకును తన ఎత్తుకు వంచుకుంది.

'నేను మోరాగారి ప్రతి చిత్రం మొదటి రోజున మాటనీ చూసేదాన్ని-వివాహకారణంగా హైదరాబాద్ వచ్చినా, మా శ్రీవారు నా అభిరుచిని గుర్తించి నా కోరికకు అడ్డు చెప్పలేదు. నా 'నీ చిత్ర దర్శన వ్రతాన్ని' కొనసాగనిచ్చారు. వారికి నా కృతజ్ఞతలు. మోరాగారు ఇంతవరకూ నటించిన చిత్రాల్లోని సన్నివేశాల ఫోటోలు సంపాదిస్తున్నా చాలావరకు వారు నటించిన చిత్రాలలో వారి నటనను విశ్లేషించాను. ఈ సందర్భంగా నేను వారిని చాలా సార్లు కలిశాను.

'కుమారీ! నీకు డాక్టరేట్ వస్తుంది. రాగానే నాకు చెబితే నీ సిద్ధాంత వ్యాసాన్ని గ్రంథంగా ప్రచురిద్దాం. ఆఫ్‌కోర్స్, దాన్ని నాకే అంకిత మిస్తావనుకో' అన్నారు.

"కాని నేడు వారు లేరు. అయినా నా కావ్య కన్యకు వారే భర్త, వారే భర్త అంటూ ఘొల్లున ఏడవసాగింది.

మొదటి రా గారి సతీమణి వచ్చి, ఆమె భుజం పైన చెయ్యివేసి ఓదారుస్తూ పక్కకు తీసుకువెళ్లింది.

"తర్వాత శ్రీ సీతారామస్వామిగారు" అన్నారు అధ్యక్షులు.

సీతారామస్వామిగారు వేదిక ముందుకు రావడం, వారికి పుష్పమాల రెండో రా వేయడం- మూడో రా పొందూరు పంచల చాపు ఇవ్వడం జరిగాయి. మైకు మాన్ వచ్చి, మైకును బాగా ఎత్తు చేశాడు.

సీతారామయ్యగారు కాస్సేపు అటూ ఇటూ చూశారు. కళ్లనీళ్లు తుడుచుకున్నారు. గొంతు సవరించుకున్నారు. మెల్లిగా మాట్లాడ్డం మొదలెట్టారు.

"నేను ఇంతకు ముందు చాలా సినిమాలు తీశాను. అవన్నీ మా ఆవిడ పేరుతో వచ్చాయి. త్వరలో మోరా గారితో మొదలెట్టాలని, వారి అనుమతి తీసుకుని అడ్వాన్సిచ్చాను. వారి ఇమేజినీ, నటననూ దృష్టిలో పెట్టుకుని కథను చూస్తున్నాం. ఇప్పటి వరకూ మేం 300 కేసట్లు చూశాం. అయినా పూర్తి కథకి సరిపడే సరుకు దొరకలేదు. కొత్తవి తెప్పిస్తున్నాం. కాని, కథ విషయంలో రాజీ ప్రసక్తే లేదు. కాని వారు ఇంత తొందరపడతారనుకోలేదు. తన నటనతో మనల్ని నవ్వించిన వారు మనల్ని ఇలా ఏడిపిస్తా రనుకోలేదు" అని ఏడుస్తూ వెళ్లిపోయారు.

"తర్వాత శ్రీ తమ్మిరాజు సూర్యచంద్ర ప్రకాశ శిరోమణి. వీరు మోరాగారి అభిమాని. శ్రీకాకుళం అవతల ఉన్న చిట్టడవినించి, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి వచ్చారు. ఈ సభ కోసమే వచ్చారు వారు మాట్లాడతారు."

శిరోమణి వేదిక మీదకు వచ్చాడు. ఆయనకు పూలమాలలు, నూతన వస్త్ర బహూకరణ ఏమీలేదు - (ఆయన తెచ్చుకోలేదు, ఇచ్చుకోలేదు!)

"అయ్యా! నా గురించి ప్రెసిడెంటు గారు చెప్పారు. నేను చాలా చాలా చెప్పాలనుకుని వచ్చాను. కాని ఆయన, నా కన్నా ముందర మాట్లాడిన వారు చెప్పేశారు. అంచేత శ్రీ మోరా గారికీ, వారి శ్రీమతికీ, వారి కుటుంబ సభ్యులకీ ఆ భగవంతుడు ఆత్మశాంతి ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని వెళ్లిపోయాడు.

"దీని తరువాత వందన సమర్పణ."

మూడో రా వచ్చి ఓ లిస్టు ప్రకారం అందరికీ వందనాలు చెబుతున్నాడు వరస వరసనీ.

వేదిక వెనక హనుమచ్ఛాస్త్రిగారు మొదటి రాతో-"అయ్యా! నా కాశ్మీరు శాలువా మారి పోయింది. దాన్ని ఎవరికో వేశారు. ఎవరిదో నాకు వేశారు" అన్నాడు.

"కంగారు పడకండి. మీరిక్కడే ఉండండి, ఆటో ఛార్జీలకని అంతా వస్తారు - మీ శాలువా కనిపెట్టే పూచీ నాది" అన్నాడు రా.

అంతలో రెండో రా వచ్చి - "సార్! బేబీ గజలక్ష్మి డాన్స్ ఉందనుకుంటున్నారు జనం. ఎవ్వరూ కదల్డంలేదు -" అన్నాడు.

"డాన్స్ లేదని బోర్డు పెట్టాం కదా! అయినా, ఎందుకేనా మంచిది-మైకు వాడికి చెప్పి 'జనగణమన' ప్లే చేయమను."

"సరేనండి."

"మోరాగారు కుర్చీ దిగలేదా? మనకి ఫైనల్ పేమంట్ చేయలేదు!"

"దిగలేదండి"

ఇద్దరూ మోరా గారి కుర్చీ దగ్గరకు వెళ్లారు.

"సార్! సార్! మా బిల్లు" అన్నారు.

ఆయన కదల్డం లేదు.

"పాత్రలో జీవిస్తున్నారు."

"ఏవండీ! లేవండీ. సభ అయిపోయింది."

అయినా లేవడం లేదు.

"సార్! సార్! మిమ్మల్నే!" అని భుజం పట్టుకు కుదిపారు.

"అయ్యబాబోయ్! నా బిల్లు" అన్నాడు మొదటి రా.

"ప్రాణం పోయినట్టుంది!"

"తన సంతాప సభను తానే చూసుకున్న ధన్యజీవి."

"ఆయన అంతిమ శ్వాస విడిచేవరకూ నటిస్తాననేవారు - అలాగే నటించారు!"

"ఇలాంటి చావు అందరికీ వస్తుందా?"

"ఏవండీ! ఏవండీ!" అంటూ వారి శ్రీమతి వచ్చి ఆయన పాదాల వద్ద కూలిపోయి ఏడుస్తోంది.

నేపథ్యంలో జనగణమన వినబడుతూనే ఉంది.

●

**ఫలహారధారిగా శుక్లాంబరధారి**

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 18-9-96 సంచిక, 72వ పేజీలోని చిత్రం బెంగుళూరు - రాజాజీ నగర్‌లోని చిన్న గణపతి ఆలయ మూలవిరాట్టు వినాయక చవితినాడు వివిధ ఫలాలతో అలంకృతమయినట్టిది.

పంపిన వారు శ్రీ ఆర్. ధర్మారావు (పైడి భీమవరం).